# యువకుడి అనుమానాస్పద మృతి

### పురుగుల మందు తాగాడా బలవంతంగా తాగించారా?

**పాపన్నపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని యూసుఫ్‌పేట గ్రామానికి చెందిన వడ్ల రాజశేఖర్ (27) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వడ్ల రాజశేఖర్ (అవివాహితుడు) వడ్ల పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. శుక్రవారం ద్విచక్ర వాహనంపై కొత్తపల్లికి వెళుతున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు బలవంతంగా పురుగుల మందును తాగించారన్నారు. చికిత్స నిమిత్తం రాజశేఖర్‌ను మెదక్ ఆసుపత్రికి అక్కడి నుంచి హైద్రాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలిచంగా చికిత్స అందుకుంటూ ఆదివారం రాత్రికి తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడన్నారు. రాజశేఖర్‌రే పురుగుల మందును సేవించాడా, బలవంతంగా ఎవరైనా తాగించారా అని అనుమానం వ్యక్తం అవుతున్నట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి సిద్దిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## మళ్లీ మూసుకున్న ఏడుపాయల ఆలయం

### రాజగోపురంలోనే అమ్మవారికి పూజలు



పాపన్నపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త: మండలంలోని ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆల యం ముందు నుంచి మంజీర నీటి ఉధృతి పెరగడంతో ముందస్తు జాగ్రత్తగా వనదుర్గా మాత ఆలయాన్ని అధికారులు మూసివేశారు. ప్రధాన ఆలయంలో జరగాల్సిన పూజలు ఆలయ ఆవరణలోని రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత ఐదారు రోజులుగా ఆలయ ముందు నుంచి నీటి ఉధృతి అధికంగా ఉండటంతో ఆలయాన్ని మూసేయగా నీటి ఉధృతి తగ్గడంతో ఆదివారం ఆలయాన్ని తెరిచి గర్భాలయంలోనే అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ఆలయాన్ని మూసివేసి రాజగోపురంలోనే అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండ వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను అదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి అయన మాట్లాడారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో తీసుకున్న దరఖాస్తులను పరిష్కరించి వారంలోగా నివేదిక అందించాలన్నారు. ప్రజల నుంచి మళ్లి మళ్లి దరఖాస్తుల రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చేపల వలకు చిక్కిన భారీ కొండ చిలువ

**కొల్చారం, సెప్టెంబర్11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంగాయిపేట గ్రామ శివారులోని పెద్ద చెరువులో చేపల వలకు భారీ కొండ చిలువ చిక్కింది. గ్రామ శివారులోని చెరువులోకి భారీగా వరద నీరు చేరి అలుగు పారుతుండటంతో చేపలు బయటకు వెళ్లకుండా మత్స్యకారులు వల ఏర్పాటు చేశారు. ఈ వలలో భారీ కొండ చిలువ చిక్కింది. ఉదయం అటుగా వెళ్లిన రైతులు దాన్ని గమనించి అధికారులకు సమాచారం అందించారు.



చేపల వలకు చిక్కిన భారీ కొండ చిలువ

## సింగూరు బాధితులకు సహాయం అందజేయాలి

### బిఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి ప్రకాశం



సింగూరు బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బిఎస్పీ నాయకులు

**పుల్కల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టు నిర్మాణంలో నష్టపోయిన సింగూరు గ్రామస్థులకు వెంటనే పరిహారం అందించాలని బిఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి ముప్పారం ప్రకాశం డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో కలెక్టర్ కార్యాలయం ముందు సింగూరు భూనిర్వాసితులతో కలిసి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించి ఆర్‌డిఓ మంచు నగేష్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ముప్పారం ప్రకాశం మాట్లాడుతూ సింగూరు ప్రాజెక్టు నిర్మించి సంవత్సరాల గడుస్తున్నా అనేక మంది బాధితులకు న్యాయం చేయకపోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. సింగూరు గ్రామంలో కట్టిన 150 డబుల్ బెడ్‌రూంలు అనర్హులకు పంపిణి చేశారని మండిపడ్డారు. డబుల్ ఇండ్ల కేటాయింపులో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనర్హులకు కేటాయించిన ఇండ్లను అర్హులకు కేటాయించాలని, డబుల్ బెడ్ ఇండ్లు ఖాళీగా ఉంటే స్వాధీనం చేసుకుని అర్హులకు కేటాయించాలన్నారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న క్వార్టర్స్‌లను సింగూరు ప్రజలకు పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఎస్పీ సంగారెడ్డి జిల్లా ఇంచార్జి పి మోహన్, ఆందోల్ అసెంబ్లి అధ్యక్షులు పల్లె కుమార్ గౌడ్, సింగూరు గ్రామ కమిటి అధ్యక్షులు అల్లోలు యాదయ్య, జంగంగారి కుమార్, విష్ణు, శంకర్, నాగమణి, లక్ష్మి, డప్పు అనిల్ కుమార్, శ్రీనివాస్, మల్లేష్, పోచయ్య పాల్గొన్నారు.

## బిటి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

**మునిపల్లి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మునిపల్లి, ఖమ్మంపల్లి చౌరస్తా అల్లాపూర్ రోడ్డు నుంచి బూసారెడ్డిపల్లి వరకు బిటి రోడ్డు పనుల నిర్మాణానికి ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సోమవారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ 10 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి 4కోట్ల 50లక్షల రూపాయలు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అందోల్ నియోజకవర్గం గతంలో చూడని అభివృద్ధి పనులను చేయించామని, అభివృద్ధిలో నియోజకవర్గం దూసుకుపోతోందన్నారు. మునిపల్లి నుంచి సింగూరు ప్రాజెక్టు, అందోల్-జోగిపేటకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని రోడ్ల సమస్యలకు చెక్ పెట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎంపి అధ్యక్షులు గౌడిగామ శైలజ శివశంకర్, జడ్పీటిసి సభ్యులు పైతర మీనాక్షి సాయికుమార్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్, సర్పంచ్ రమేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, యూత్ అధ్యక్షులు ఆనంద్‌రావు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

# విద్యకు ఉన్న శక్తి ప్రపంచంలో దేనికి లేదు

### సమాజం అభివృద్ధికి ఉపాధ్యాయ వృత్తే ఆధారం
### 15న సిద్దిపేటకు రైలు కూత
### మంత్రి హరీష్‌రావు



గురుపూజోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** విద్యకు ఉన్న శక్తి ప్రపంచంలో దేనికి లేదని నోబుల్ అవార్డు గ్రహీత నెల్సాన్ మండేలా అన్నారని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పత్తి మార్కెట్ యార్డులో సోమవారం ఏర్పాటు చేసిన జిల్లా ప్రైవేటు పాఠశాలల యజమాన్యాల సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. విద్యా అనేది అన్నింటికంటే చాల గొప్పదన్నారు. విద్యాను అత్యధికంగా అందుకున్న రాష్ట్రం కేరళ అన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఉపాధ్యాయులను మరువకూడదన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయ వృత్తిపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రభుత్వం ఎన్ని సౌకర్యాలు కల్పించి 50 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లోనే చదువుతున్నారని తెలిపారు. నాటి నినాదాలు నేడు నిజం అవుతున్నాయన్నారు. ఈనెల 15న సిద్దిపేటకు రైలు కూత రాబోతుందన్నారు. విద్యకు నిలయంగా, విద్య క్షేత్రంగా సిద్దిపేటను మార్చుకున్నామన్నారు. సిద్దిపేటలో దసరాకు వెయ్యి పడకల అసుపత్రిని ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు నా స్వంత ఖర్చులతో రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజాశర్మ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, బిఆర్ఎస్ నాయకులు రాజనర్సు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కాటం రఘురామ్, ప్రైవేటు స్కూల్స్ యజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### పద్మశాలీలకు మోపేడ్ వాహనాల అందజేసిన

ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మార్పులలో భాగంగా ఉపాధి కోల్పోతున్న పద్మశాలి కులస్తులను అదుకునేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందని రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పద్మశాలి కుల సంఘంతో సమావేశం నిర్వహించి బట్టలను అమ్ముకునేందుకు వీలుగా 14 మందికి మోపేడ్ వాహనాలను అందజేసి మాట్లాడారు. పద్మశాలి జాతిని కాపాడేందుకు ప్రభుత్వం ప్రతి యేటా రూ.350 కోట్ల విలువైన చీరలను నేతన్నల నుంచి కొనుగోలు చేసి దసరా, బతుకమ్మ కానుకగా అందించడం జరుగుతుందన్నారు. ప్రతి మగ్గానికి నెలకు రూ. 3 వేల అర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. మార్కండేయ గుడి నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సమాజం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కస్తూరి సతీష్, పద్మశాలి సంఘం నాయకులు బూర మల్లేశం, గుండు రవితేజ, ప్రభాకర్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం ప్రారంభం

సిద్దిపేట జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈ, డీఈ కార్యాలయాన్ని రాష్ట్ర అర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ, పంచాయతీరాజ్ ఎస్ఈ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి అధికారంలోకి వస్తే సుస్థిర ప్రజాస్వామ్య పాలన అందిస్తాం

### కేంద్రమంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో సెప్టెంబరు 11,ప్రభాతవార్త:** తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే సుస్థిర ప్రజాస్వామ్య పాలనఅందిస్తామని కేంద్రమంత్రి, రాష్ట్రబిజెపి అధ్యక్షులు కిషన్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డిజిల్లా ముదిరాజ్ మహసభ అధ్యక్షులు, బిఆర్ఎస్ నాయకులు పులిమామిడిరాజు బిఆర్ఎస్‌కు రాజీనామచేసి, బిజెపిలో చేరుతున్న సందర్బంలో విజయ సంకల్ప బహిరంగసభను సోమవారం సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో మైదానంలో ఏర్పాటు చేశారు. ఈసభకు కేంద్రమంత్రి మత్యశాఖ మంత్రి పురుషోత్తం రుపాల, కేంద్రమంత్రి, బిజెపిరాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, బిజెపి ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమీటి చైర్మేన్, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు.

ఈసందర్బంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది బలిదానాలు, త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణను కెసిఆర్ ప్రభుత్వం అప్పులపాలుజేసిందని ఆరోపించారు. ప్రభుత్వ భూములు అమ్మితే తప్ప ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తెచ్చిందని దుయ్యబట్టారు. మరోసారి బిఆర్ఎస్‌కు ఆవకాశం ఇస్తే, ప్రజల చేతికి చిప్పలు అప్పగిస్తారని అన్నారు. రాష్ట్రంలో నియంత పాలన నడుస్తుందని అన్నారు. కాంగ్రేస్‌కు ఓటువేసినా, బిఆర్ఎస్‌కు వేసినట్లేనని, బిఆర్ఎస్, కాంగ్రేస్‌లకు వేస్తే ఎంఐఎంకు వేసినట్లు అవుతుందని అన్నారు. ఏపార్టీ అధికారంలోకి వచ్చినా, ఎంఐఎం చేతిలో కీలుబొమ్మలుగా మారుతాయని కాంగ్రేస్, బిఆర్ఎస్‌తీరును దుయ్యబట్టారు. ఇప్పటికే కాంగ్రేస్, బిఆర్ఎస్ పాలన చూశారని, ఇప్పుడు బిజెపికి ఆవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. తెలంగాణ రాష్ట్రం కెసిఆర్ కుటుంభపాలనలో బంధీ అయిందని, కెసిఆర్ కుటుంభం నుండి విముక్తి కల్పించాల్సిన అవసరం అసన్నమైందని అన్నారు. కెసిఆర్ రాష్ట్రంను అప్పులపాలు చేశారని, రాష్ట్రం అప్పులు పెరిగిపోయాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కెసిఆర్ పాలన తీరును దుయ్యాబట్టారు. బిజెపి ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమీటి చైర్మేన్, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కెసిఆర్ మాయమాటలతో అరచేతిలో స్వర్గం చూపుతున్నాడని ఆరోపించారు. కెసిఆర్ మాటాలకు చేతలకు పోంతనలేదని విమర్శించారు. బిసి జనాభాకు అనుగుణంగా ఎమ్మెల్యే టికెట్లు కెటాయించలేదని, ఇందుకు ఉమ్మడి మెదక్‌జిల్లా సజీవ సాక్షమని గుర్తుచేశారు. ఈసందర్బంగా కేంద్రమంత్రులు పురుషోత్తం రుపాల, కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌లు పులిమామి డిరాజుకు అతని అనుచరులకు బిజెపి పార్టీ కండువ కప్పి పార్టీలోకి అహ్వానించారు. సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, పార్టీజిల్లా అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, బిజెపి నాయకులు నందీశ్వర్‌గౌడ్, సంగప్ప, విజయ్‌పాల్‌రెడ్డి, కొండాపురం జగన్, విష్ణువర్ధన్‌రెడ్డి, పోచారం రాములు, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే పాల్గొన్నారు.



సంగారెడ్డిలో కాంగ్రెస్ నాయకులకు సూచనలు చేస్తున్న డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి

## ప్రభుత్వ అవినీతిని ఎండగడదాం కాంగ్రెస్‌ను అధికారంలోకి తెద్దాం

### పార్టీ నాయకులతో డిసిసి అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ఎడగడుతూ రానున్న శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేల ప్రతి నాయకుడు, కార్యకర్త తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందని డిసిసి అధ్యక్షురాలు తూర్పు నిర్మల జగ్గారెడ్డి పిలపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగా రెడ్డి పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయ కులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి నియోజకవర్గంలో కొనసాగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులతో సమాలోచనలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజి అనంత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ వైద్య కళాశాల ఎక్కడ మంత్రి గారు..

### కాంగ్రెస్ నాయకుల సూటి ప్రశ్న
### నిరసనగా 14న మెదక్ బంద్‌కు పిలుపు
### టీపీసీసీ కార్యదర్శి మ్యాడం బాలక్రిష్ణ



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** మెదక్ నియోజకవర్గం అభివృద్ధి చెందకపోవడానికి కారణం మంత్రి హరిష్‌రావు, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అని టీపీసీసీ కార్యదర్శి మ్యాడం బాలక్రిష్ణ ఆరోపించారు. సోమవారం మండల పరిధి గవ్వలపల్లిలో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆస్తులను పెంచుకోవడానికి మెదక్‌ను నాశనం చేశారని మండిపడ్డారు. 15 రాష్ట్రంలోని తొమ్మిది వైద్య కళాశాలలను ప్రారంభిస్తున్న మంత్రికి సిగ్గులేదా అని అన్నారు. మెదక్‌పై మంత్రి హరిష్‌రావు పెత్తనం ఎంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో అసెంబ్లీ సాక్షిగా నియోజకవర్గానికి వైద్య కళాశాలను ప్రకటించిన మంత్రి నేడు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. అసెంబ్లీ ప్రకటనతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంబురాలను జరుపుకొని మంత్రి పర్యటనకు వస్తే బాజా భజంత్రిలను ఏర్పాటు చేసిన నాయకులకు సిగ్గు చేటుగా లేదా అని ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజి మెదక్‌కు కేటాయించనందుకు నిరసనగా ఈ నెల 14న మెదక్ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యం గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్‌గౌడ్, మోహన్ నాయక్, గోవర్థన్, యాదగిరి తదితరులు పాల్గోన్నారు.

## కిసాన్ మోర్చ రాష్ట్ర సభ్యుడిగా సురేందర్ నాయక్

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్ర కిసాన్ మోర్చ సభ్యుడిగా మండల పరిధి టీ మాందాపూర్ తండాకు చెందిన మాజీ జడ్పీటీసీ స్వరూప భర్త సురేందర్ నాయక్ సోమవారం ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర కిసాన్ మోర్చ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి నియామక పత్రం అందించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని, నియోజక వర్గ అభివృద్దే తన లక్ష్యం అని అన్నారు. సహకరించిన భాజాపా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధ్యాయవృత్తి పవిత్రమైనది : గాలి అనిల్‌కుమార్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాంగ్రెస్ టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్‌కుమార్ తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** సమాజంలో ఉపాధ్యాయవృత్తి ఎంతో పవిత్రమైనదని కాంగ్రెస్ టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మెదక్ పార్లమెంటరీ ఇంచార్జీ గాలి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గాలి అనిల్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలోని చాముండేశ్వరి కళ్యాణ మండపంలో నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాంగ్రెస్ టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మెదక్ పార్లమెంటరీ ఇంచార్జీ గాలి అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరు కాగా కాంగ్రెస్ టిపిసిసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్, సోమన్నగారి రవిందర్‌రెడ్డి లు పాల్గోన్నారు. ఈసందర్భంగా గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను భావిబారత పౌయిలుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత గురువును దైవంగా బావించే సంస్కృతి మనదని ఆయన పేర్కొన్నారు. పాఠశాల తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులందరు విద్యార్థులకు క్రమశిక్షణను నేర్పి వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరె విదంగా విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. విద్యార్థులను సమాజానికి ఉపయోగ పడే పౌరులుగా తీర్చి దిద్దేదే ఉపాధ్యాయులని అన్నారు. ఈ సందర్బంగా సమాజానికి ఉపాధ్యాయులు చేసిన సేవలు మరవలేనివని అన్నారు. ఈమేరకు నర్సాపూర్ నియోజకవర్గంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్బంగా నియోజకవర్గంలోని ఉత్తమ ఉపాధ్యాయులను శాలూవాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించి మెమోంటోలను అందజేశారు. ఈకార్యక్రమంలోకాంగ్రెస్ టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మెదక్ పార్లమెంటరీ ఇంచార్జీ గాలి అనిల్‌కుమార్, కాంగ్రెస్ టిపిసిసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్, సోమన్నగారి రవిందర్‌రెడ్డి లతో పాటు ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, మాజీ జడ్పిటీసి శ్రీనివాస్‌గుప్త, నర్సాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లేషం, నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, వెల్దుర్థి అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, హత్నూర అధ్యక్షులు కృష్ణ, చింతల్‌చెరువు ఎంపిటీసి బాస్కర్, నర్సాపూర్ మండల్ వర్కింగ్ ప్రసిడెంట్ ఉదయ్‌కుమార్, పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ రశీద్, నాయకులు రాధాకృష్ణాగౌడ్, సంగసాని నర్సింగరావు, శ్రీశైలంయాదవ్, అజ్మత్, ప్రసాద్, మల్లేష్ యాదవ్, దేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# యాజమాన్య ప్రకటనతో ట్రైడెంట్ కార్మికుల సంబరాలు

**జహీరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కర కర్మాగార యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, చెరుకును త్వరలోనే గానుగాడిస్తామని కర్మాగార యండి ప్రకటన చేయడంతో కర్మాగార కార్మికులు సోమవారం కర్మాగార ఆవరణలో సంబరాలు చేసుకున్నారు. సోమవారం కర్మాగార ఆవరణలో కార్మిక సంఘం అధ్యక్షులు యంజి రాములు యాదవ్ నోటిని కార్మికులు మితాయిలు తినిపించి తీపిని చేశారు. ఆ సందర్బంగా కర్మాగార ఆవరణలో కంపెనీ జిఎంలతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో యంజి రాములు మాట్లాడుతూ కార్మికుల అవస్థలను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం లాకౌట్‌ను ఎత్తివేసి కార్మికులను విధుల్లోకి తీసుకుందని ఆనందం వ్యక్తం చేశారు. కర్మాగార ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కార్మికులు తమకు రావాల్సిన బకాయిలను సైతం చెరుకు రైతులు పాట్లు పడరాదన్న సదుద్దేశంతో వాయిదా పద్దతిలో తీసుకునేందుకు అంగీకారం తెలపారన్నారు. కష్టపడి కర్మాగారాన్ని నడుపుతామని కార్మికులు హామి చేశారన్నారు. ఈ నెల 15వ తారీఖు నుంచి కర్మాగారాన్ని పున: ప్రారంభించనున్నట్లు వివరించారు. కార్మికులకు, చెరుకు రైతులకు రావాల్సిన బకాయి డబ్బులను చెల్లించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజారత్నం, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, తుకారాం, యూసుఫ్, సుభాస్, కార్మికులు పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న యంజి రాములు



ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి : తహసీల్దార్

**అక్కన్నపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ సంజీవ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో గ్రామస్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. బిఎల్ వోలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు గ్రామాలలో ఇంటింటికి తిరిగి ఓటు హక్కులేనివారికి దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించడం తో పాటు ఓటు ప్రాముఖ్యతను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, ఆర్ఐ యాదగిరి, కార్యదర్శి లక్ష్మీకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు మేనమామ సిఎం కెసిఆర్

**-హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్**

**హుస్నాబాద్/అక్కన్నపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త**



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

పేదింటి ఆడబిడ్డలకు మేనమామ సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ మండలంలో ఇప్పటి వరకు 1621 మందికి కళ్యాణలక్ష్మి పథకం కింద 15 కోట్ల 43 లక్షల 74 వేల 36 రూపాయలు, అక్కన్నపేట మండలంలో 1598 మంది లబ్ధిదారు లకు రూ 10కోట్ల 76లక్షల 50వేల రూపాయల చెక్కులు పంపిణీచేయగా నేడు హుస్నాబాద్ మండ లానికి చెందిన 35 మంది, అక్కన్నపేట మండలా నికి చెందిన 20 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ చైర్మెన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్ చైర్మెన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపిలు లకావత్ మానససుభాష్, మాలోతు లక్ష్మీభీలు నాయక్, జడ్పిటిసి భూక్యమంగ శ్రీనివాస్, ఎఎంసి చైర్మెన్ ఎడబోయిన రజనితిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు వాల సుప్రజనవీన్‌రావు, బొల్లి కల్పన శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తరాల లత మహేందర్, దుండ్ర భారతి, స్వరూపలింగానాయక్‌తో పాటు అక్కన్నపేట ఎంపిటిసి బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పెసరు సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : కౌన్సిలర్



మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ వాల సుప్రజ నవీన్‌రావు

**హుస్నాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కౌన్సిలర్ వాల సుప్రజనవీన్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని 20వ వార్డులో ఇంటింటికి తిరిగి మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు తీసుకున్న మొక్కలను కచ్చితంగా నాటడంతో పాటు నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికుమార్, వార్డు ఆఫీసర్ ప్రశాంత్, ఆర్పి వెంకటలక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రుణాలు సకాలంలో చెల్లించాలి




మాట్లాడుతున్న యూకో బ్యాంక్ మేనేజరు

**హుస్నాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :** స్ట్రీట్ వెండర్స్ తీసుకున్న రుణాలను సకాలంలోచెల్లించాలని బ్యాంక్ మేనేజరు రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో మెప్మ ఆధ్వర్యంలో పట్టణ స్వనిధి సే సమృద్ధి క్యాంప్‌ను యూకోబ్యాంక్ అధికారులతోకలసి నిర్వహించారు. ఈ సందర్భంగా స్ట్రీట్ వెండర్స్ ఏర్పాటుకు రుణం తీసుకున్న లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రుణాలు తీసుకున్న ప్రతీ ఒక్కరు సకాలంలో చెలిస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు. రుణాలు చెల్లించేందుకు ఫోన్‌పే, గుగుల్‌పే లలో సైతం అవకాశం కల్పించినట్లు సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మ టౌన్ మిషన్ కోఆర్డినేటర్ రాజు, ఆర్‌పిలు వీధి వ్యాపారస్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఏకగ్రీవ తీర్మానం



గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్, తదితరులు

**అక్కన్నపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :** మండలంలోని కేశనాయక్ తండా గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం గ్రామసభను గొల్లపల్లిలోని పాఠశాలలో ఏర్పాటు చేసి ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామసభకు సర్పంచ్ బానోతు రవీందర్‌నాయక్ అధ్యక్షత వహించారు. గ్రామసభకు ముఖ్యఅతిథిగా ఎంపివొ కవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని క్రీడా ప్రాంగాణం సమీపంలో సర్వేనం 465లో నాలుగు గుంటల్లో పంచాయతి భవనం నిర్మించేందుకు పాలకవర్గం, ప్రజలు తీర్మానం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్‌రెడ్డి, వార్డు సభ్యులు భూక్య రమేష్, గుగులోతు కిషన్, బండి రవీందర్, ప్రమీల, మాజీ ఎంపిటిసి బండి సమ్మయ్య, తండావాసులు భూక్య లింగం, రాజు, బానోతు రామ్‌జీ, భూక్య గోప్య, భీమా, వీరన్న, సీతారం, బండి సారయ్య, రాజయ్య పాల్గొన్నారు.

### పెద్దనందిగామ గ్రామంలో ఘనంగా బొడ్రాయి స్థాపన

**కొడంగల్, సెప్టెంబర్ 11 ప్రభాతార్త :** మండల పరిధిలోని పెద్దనందిగామ గ్రామంలో సోమవారం బొడ్రాయి స్థాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కర్నాటక రాష్ట్రం జూకెన్‌పల్లి మఠం పీఠాధిపతి శ్రీగని సిద్ధలింగేశ్వర మహాస్వామి అద్వర్యంలో నవగ్రహాల పూజ నిర్వహిం చారు. అనంతరం బోడ్రాయి స్దాపన కార్యక్రమాన్ని చేపట్టారు. బొడ్రాయి ప్రతిష్టాపన సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# హనుమంతుని కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలి

**రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి**



హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సునీతాలక్ష్మారెడ్డి

**కొల్చారం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** హనుమంతుని కృప కటాక్షాలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి శివారులో ఏడుపాయలకు వెళ్లే దారి సమీపంలో కురువగడ్డ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని కనుల పండుగలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సునీతాలక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఆలయంలో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హనుమంతుని కృప కటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోసాలతో ఉండాలన్నారు. పాడి పంటలు సుభిక్షంగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ఏడుపాయల దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత సురోత్తంరెడ్డిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మహిళలు సునీతాలక్ష్మారెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం అప్పాజిపల్లి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మేఘమాల సంతోష్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్‌గుప్త, మాజీ జెడ్పీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచులు చలం యూస్సీ యాదగిరి, గడ్డమీది నాగరాణి నర్సింలు, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, ఆలయ ఫౌండర్ సురోత్తంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సూరెగారి నరేందర్‌రెడ్డి, దేవన్నగారి శేఖర్, వడ్ల ప్రభాకర్, రాజాగౌడ్, మాజీ ఉప సర్పంచి చిన్న రాములు, కన్నెబోయిన గోపాల్, చలం యాదగిరి, వీరేశం, కోరబోయిన కాశీ, సొసైటీ చైర్మన్ నాగురి మనోహన్, ధనరాజ్, చిట్యాల యాదయ్య, కరెంటు రాజాగౌడ్, జంగిల్ పోచయ్య, సురేందర్, కన్నెబోయిన శేఖులు, చింతల కిషన్, భాగయ్య, శేఖులు, బీఆర్ఎస్ నాయకులు, అప్పాజిపల్లి మహిళలు తదితరులు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**-మంత్రి మల్లారెడ్డి**

**కీసర, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**

గ్రామాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కీసర మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో నూతన గ్రామపంచా యతీ కార్యాలయ ప్రారంభోత్సవానికి మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సిఎం కెసిఆర్ పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈసారి ఎన్నికల్లో గెలిచి మూడవ సారి కూడా సిఎంగా కెసిఆర్ కావడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిచైర్మన్ శరత్ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ అందాలు మల్లేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ రద్దు చేయిస్తా తహసీల్దార్ హామీ

**ధారూర్ సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని రాంపూర్ తండా గిరిజన రైతులకు రిజిస్ట్రేష న్ రద్దు చేయిస్తానని తహసీల్దార్ సోమవారం హామీ ఇచ్చారు. గిరిజన రైతులు తమ భూములు తమకు ఇచ్చేంతవరకు ఏ అధికారిని వదలమని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దికాలంగా పంటలు సాగు చేస్తున్నామని ఇతరులకు ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేశారని తహసీల్దార్‌ను నిలదీశారు. తహసీల్దార్ హామీ ఇవ్వగా గిరిజన రైతులు వెనుతిరిగి వెళ్లిపోయారు.

## యువతి,యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

**పరిగి సెప్టెంబర్ 11,ప్రభాతవార్త :**

18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సహాయ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. స్వీప్ కార్యక్రమాలలో భాగంగా సోమవారం పరిగి పట్టణంలోని పల్లవి డిగ్రీ కళశాలలో విద్యార్థులకు ఓటరు అవగాహనపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని ప్రతి ఒక్కరూ ఫామ్-6 ద్వారా ఈనెల 19వరకు ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని అన్నారు. ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని, ఎన్నికలలో యువతి, యువకులు ప్రతి ఒక్క రూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ,నిర్భ యంగా మనకు పాలించే మంచి నాయకున్ని ఓటు వేసి ఎన్నుకు నాలని ఆయన సూచించారు. రాబోవు శాసన సభ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఓటింగులో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ ఆక్టివిటీ కో ఆర్డినేటర్ కోటాజీ, ఆర్డివో విజయ కుమారి, కళాశాల ప్రిన్సిపాల్ ,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్‌నాయక్, ప్రిన్సిపల్ మల్లయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూరే శ్వర్ స్వామి, సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టుపై నిరసన

**కొడంగల్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పుర్రా బాలకిషోర్‌యాదవ్ అన్నారు. సోమవారం ఐబిలో టీడీపీ మహబుబ్‌నగర్ జిల్లా అధికార ప్రతినిధి డి.కె.రాములు, జిల్లా ప్రచార కార్యదర్శి తలారీ శేఖర్‌లతో కలసి విలేకరులతో మాట్లాడారు. రాజకీయంగా ఎలాంటి మచ్చ లేకుండా 14 సంవత్సరాలపాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబును అరెస్టు చేయం బాధకరమన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పడానికి ఆ రాష్ట్ర ప్రజలు సిద్దంగా ఉన్నారని అన్నారు. 46 సంవత్సరాల సుధీర్ఘ రాజకీయ అనుభవం, భావితరాల ఉజ్వల భవిష్యత్తుకై బంగారు బాట వేసే ముందు చూపు కలిగిన వ్యక్తి అహర్నిషలు ప్రజాసంక్షేమం కోసం పాటుపడే నీతి నిజాయితీలతో కష్టపడే వ్యక్తి చంద్రబాబు విజయాన్ని తెలుగుదేశం ప్రభంజనాన్ని అడ్డు కోలేకనే అక్రమ కేసుల్లో ఇరికించి టీడీపీ నాయకులు, కర్యకర్తలను భయ బ్రాంతు లకు గురి చేసేందుకు అక్రమంగా రిమాండ్‌కు పంపడం సీఎం జగన్ పైశిచిక అనందానికి నిదర్శనమన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు మన్నె బస్వరాజ్‌యాదవ్, నరేష్, బుచ్చి రెడ్డి, మనోహర్, అరుణ్, సాయిరెడ్డి, మనోజ్, అశప్ప, బిచ్చప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## 16న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభం

**-జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**

**వికారాబాద్ సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**

ఈనెల16న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించకోబోతున్నందన జిల్లా నుండి పెద్ద ఎత్తున రైతులు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులు ఆదేశించారు. సోమవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ముందుగా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా జిల్లాకు దాదాపు 5 లక్షల ఎకరాలకు సాగునీరు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈనెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభ కార్యక్రమానికి జిల్లాకు 134 బస్సులు కేటాయించడం జరిగిందని, ఇట్టి బస్సుల ద్వారా నాలుగు నియోజకవర్గాల నుండి రైతులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి సురక్షితంగా తరలించి తిరిగి తీసుకురావాల్సిన పూర్తి బాధ్యత వ్యవసాయ శాఖ చేపట్టాలన్నారు. ప్రాజెక్టు ద్వారా విడుదల చేసిన కృష్ణా జలాలు కలశాలలో తీసుకువచ్చి మరుసటిరోజు దేవాలయాలలోని విగ్రహాలను నీటితో కడగడం జరుగుతుందన్నారు. అలాగే ఈనెల 15న జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాలను వేర్చువల్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయనున్నందున ప్రోటోకాల్ ప్రకారంగా ముఖ్యఅతిథులు అందరినీ ఆహ్వానించాలని, అలాగే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఈరోజు వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి 177 ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు సమస్యల ు వెంటనే పరిష్కరించాలని వారు పేర్కొన్నారు.

### నిర్ధవెల్లిలో ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహావిష్కరణ

**షాద్‌నగర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**

షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండల పరిధిలో ఉన్న నిర్ధవెల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవం, పోచమ్మ తల్లి విగ్రహావిష్కరణ వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈకార్యక్రమానికి వైఎస్సార్ టీపీ పార్టీ షాద్ నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కోసం రూ.1లక్ష 11 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.డి.ఇబ్రహీంను శాలువతో ఘనం గా సత్కరించారు. అనంతరం వేద పండితులు ఆయనను ఆశీర్వదించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు, పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విజయభేరీ సభను విజయవంతం చేయండి

**-జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి గడ్డంప్రసాద్ కుమార్**

**వికారాబాద్ సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**

ఈ నెల 17న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ తుక్కుగూడలో నిర్వహిం చబోయే విజయభేరీ సభ ు విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం వికారా బాద్ పట్టణంలోని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...హైదరాబాద్ గడ్డపై తొలిసారిగా 10లక్షల మందితో భారీ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో దేశం నలుమూలల ుంచి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, వివిధ రాష్ట్రాల ముఖ్య మంత్రులు, నాయకులు వస్తారని అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ తెలంగాణ కోసం మరో అడుగు ముందుకు వేస్తున్నారన్నారు. మేనిఫెస్టోతో కూడిన గ్యారంటీ కార్డు కూడా ప్రతి ఇంటికి ఇవ్వ ఎన్నట్లు తెలిపారు. భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయకులు రత్నారెడ్డి, సామ రాం చంద్ర రెడ్డి రఘుపతి రెడ్డి కమల్ రెడ్డి చాపల శ్రీనివాస్ ఉన్నారు.

## జ్యోతిబా పూలే జాతీయ అవార్డుకు ఎంపికైన రాజ్‌కుమార్

**తాండూరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :**

వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన బీసీ ఉద్యమ నేత, జాతీయ బీసీ కార్య వర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ మహాత్మ జ్యోతిబా పూలు జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జాతీయ అవార్డు కమిటి సభ్యులు ప్రకటించారు. వచ్చే అక్టోబరు నెల 15న ఢిల్లీలో అవార్డును అందజేయనున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కార్యాల యంలో సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ నల్లా రాధాకృష్ణ బీసీ నేత రాజ్‌కు మార్‌కు అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. బహుజన సాహిత్య అకాడమి ప్రతి ఏటా ఉద్యమ కారులకు, సంఘ సేవకులకు, రచయిత, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు మహాత్మా జ్యోతిబా పూలే జాతీయ అవార్డులను ప్రకటించడం జరు గుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా గత 30 ఏళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం కోసం పోరాడుతున్న రాజ్‌కుమార్‌ను జాతీయ అవార్డు కోసం ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. జాతీయ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనకు జాతీయ అవార్డు ప్రకటించిన బహుజన సాహిత్య అకాడమి అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎం గౌతమ్‌లకు రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కమిటి వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఎరన్ పల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పెద్దనందిగామలో ఘనంగా బొడ్రాయి స్థాపన

**కొడంగల్, సెప్టెంబర్ 11ప్రభాతవార్త**

మండల పరిధిలోని పెద్దనందిగామ గ్రామంలో సోమవారం బొడ్రాయి స్థాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని మాజీసర్పంచ్ సంజీవ్‌రెడ్డి, గ్రామస్దులు పూజలు నిర్వహించారు. అంతకుముందు కర్నాటకరాష్ట్రం జూకెన్‌పల్లి మఠం పీఠాధిపతి శ్రీగని సిద్ధలింగేశ్వర మహాస్వామి అద్వర్యంలో నవగ్రహాల పూజ నిర్వహించారు. అనంతరం బోడ్రాయి స్దాపన కార్యక్రమాన్ని చేపట్టారు. బొడ్రాయి ప్రతిష్టాప న సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

### డిక్లరేషన్‌లతో కాంగ్రెస్ పార్టీలో ఫుల్ జోష్

**నందిగామ సెప్టెంబర్11,ప్రభాతవార్త :**

ప్రజాసేవయో పరమావధిగా భావించి రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు నిస్వా ర్థంగా సేవలిందిస్తున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌కు కాంగ్రెస్ హైకమాండ్ షాద్‌నగర్ టికెట్ ఖరారు చేసి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఊరు, వాడలో సభలు సమావేశాలు నిర్వహిస్తూ దూకుడు పెంచారు. సబండవార్గలకు డిక్లరేషన్‌లతో మేలు జరుగుతుందని, వీర్లపల్లికి ప్రజల నుండి మద్దతు పెరగడంతో కార్యకర్తలు, మహిళలు, అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తు న్నారు. నందిగామ మండలం నర్సప్పగూడలో మాజీ సర్పంచ్ కావలి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరగబడ దాం...తరిమికొడదాం అనే కాంగ్రెస్ ప్రోగ్రాం పూర్తి సక్సెస్ అయింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాప్రయో జనాల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రకటిస్తున్న వివిధ డిక్లరేషన్‌లతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతగానో మేలు జరుగుతుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పేర్కొంటున్నారు. తిరగబడదాం..తరమికొడదాం ఊరూర తిరుగుతూ ప్రజలతో మమేకమై వారికి రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, టిపిసిసి ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి 2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రక టించిన డిక్లరేషన్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.....రైతన్నలకు ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ, భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ..12వేలు ఆర్థిక సహాయం ధరణి పోర్టల్ రద్దు చేసి పోడు భూములకు పట్టాలు పంపిణీ ,రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, రూ.500లకే వంట గ్యాస్ సీలిండర్, మహిళలకు పావాలా వడ్డీ రుణాలు ,చేయూత పథకం కింద వృద్ధులు, వికలాంగులు, వితంతు వులు, ఒంటరి మహిళలు, గీతా కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల కు, డయాలసిస్ రోగులకు నెలకు రూ4వేలు పెన్షన్, తెల్లకార్డున్న ప్రతి కుటుంబానికి రూ.5లక్షల వరకు అన్ని జబ్బులకు ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచిత వైద్యం ఇల్లు లేని ప్రతి కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు. ప్రతి పేద కుటుంబానికి 9రకాల నిత్యవసర సరుకులు (రేషన్) పంపిణీ, నిరుద్యోగులకు నెలకు 4వేలు నిరుద్యోగ బృతి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో 2లక్షల ఉద్యోగాల భర్తీ, ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ ఈడబ్ల్యుఎస్ విద్యార్థులందరికి ఫీజురియంబర్స్‌మెంట్, తెలంగాణ అమవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ,25వేల గౌరవ పెన్షన్, 18 సంవత్సరాలుపైబడి చదువుకునే ప్రతి యువతికి ఎలక్ట్రీక్ స్కూటర్ అందజేత కేజీ టు ఫీజీ ఉచిత విద్య, తదితర సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని వివరించారు. తెలంగాణలో ప్రజా సంక్షేమం బాగుండి సమ సమాజ స్థాపన జరగాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని కావున ప్రజలందరూ రానున్న 2023 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పది రోజులుగా మూతపడిన ఎంఈవో కార్యాలయం

**దౌల్తాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :**

విద్యాశాఖలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు తమ డిమాండ్‌ల సాధన కోసం పోరు బాట పట్టడంతో మడలంలోని ఎంఈవో కార్యాలయం గత పది రోజులుగా మూతపడింది. గత 20 సంవత్సరా లుగా చాలిచాలనీ వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న తమను రెగ్యులరైజ్ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని వాపోతున్నారు. ఈ నెల 1 నుంచి తమ విధులను బహిష్కరించి రోజుకో రీతిలో వినూత్నంగా నిరసనలు చేపడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయపరమైన డిమాండ్‌లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఇంజనీర్లు నాణ్యమైన ప్లానర్స్ అందించాలి

**-ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** ఇంజనీర్లు ఇంటి నిర్మాణ యజమానులకు నాణ్యమైన ప్లానర్స్ భూములకు అనుగుణంగా ఇవ్వాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో బాలాజీ ప్లానర్స్, డ్రీమ్ హోమ్ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ, ఎఫ్‌డిసి చైర్మన్‌లు మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో ప్లానర్స్ ఇచ్చే ఇంజనీర్లు ముందుగా భూమిని పరిశీలించి దానికి అనుగుణంగా ఉండే విధంగా నిర్మాణాలు చేయాలని సూచించాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిర్మాణాలు చేపట్టేలా ప్లానింగ్ చేయాలన్నారు. స్వయం ఉపాధి కోసం స్థానిక యువకుడు గడీల సంజయ్‌కుమార్ ఏర్పాటుచేసిన ప్లానర్స్ కార్యాలయం విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గడీల జయరాములు ముదిరాజ్ స్థానికంగా అందరికీ సమేతంగా ఉండాలని ఆయన కుమారుడు సంజయ్‌కుమార్ ప్లానర్స్ ఇంజనీరుగా రాణించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, లక్ష్మి కిషన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, మండల ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ అయిన రైతులకు కొత్త పంట రుణాలు

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 11(ప్రభాతవార్త):** మండలంలోని వివిధ బ్యాంకులలో పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ అయిన రైతులకు కొత్త పంట రుణాలు తీసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి వసంతరావు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎస్‌బిఐ, ఎపిజివిబి, డిసిసిబి బ్యాంకుల మేనేజర్లతో పంట రుణమాఫీ గురించి, కొత్త పంట రుణాలు అందించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 డిసెంబర్ 11 నాటికి బ్యాంకులో పంట రుణం తీసుకొని చెల్లించని రైతులకు రుణమాఫీ డబ్బులు జమ అవుతున్నాయని, ఇప్పటి వరకు మండలంలో 2826 మంది రైతులకు రూ.13 కోట్ల రుణమాఫీ డబ్బులు జమ అయ్యాయని అన్నారు. రుణమాఫీ అయిన రైతులు వెంటనే కొత్త రుణాలు కూడా పొందుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు రుణమాఫీ అయిన రైతులు 1500 మంది పంట రుణాలు పొందినట్లు తెలిపారు. మిగిలిన రైతుల రుణమాఫీ కూడా ఈ నెలలో అవుతుందని అన్నారు. ఆయన వెంట ఏఈఓ మహ్మద్ ఖలీల్ ఉన్నారు.

## కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** పేద కుటుంబాలకు ఆడపిల్లల వివాహం భారం కాకూడదన్న సమున్నత లక్ష్యంతో సీఎం కేసీఆర్ కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం అమీన్‌పూర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 9 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహాయ సహకారాలతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, బీఆర్ఎస్ నేత చంద్రశేఖర్, స్థానిక ప్రజాప్రతిధులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరంలాంటిదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట మండలం శివ్వాయపల్లి గ్రామానికి చెందిన మంజులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన లక్ష రూపాయల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీ వీణ సుభాష్‌గౌడ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుంట్ల రాములు, శివాయపల్లి సర్పంచి నరేష్, నాయకులు గంగారం విజయరావు, సత్తయ్య పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు హాజరైన ఎంపిపి

**అక్కన్నపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :** మండలంలోని నందారం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ వాసాల లచ్చయ్యతో పాటు అదే గ్రామానికి చెందిన బొమ్మ గట్టవ్వలు అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎంపిపి మాలోతు లక్ష్మీభీలునాక్ వారి అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి బౌతిక దేహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగాల ఎల్లయ్య, మాజీ జడ్పిటిసి భీల్‌నాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థిక సహాయం అందజేత...**

అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామపరిధిలోని బంగారులొద్ది తండాకు చెందిన ధరావత్ సుక్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ధరావత్ తిరుపతినాయక్ వారి అంత్యక్రియలకు హాజరై అంత్యక్రియల నిమిత్తం రూ 5వేల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బానోతు భాస్కర్, తిరుపతిశ్రీను, జవహర్‌లాల్, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల దరఖాస్తుల ఆహ్వానం

**కొడంగల్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ పాఠశాలలు, వికారాబాద్ జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో బోధించేందుకు సాంఘీకశాస్త్రం, ఆంగ్లం, గణితశాస్త్రం, ఆంగ్ల మాధ్యమాల్లో బోధించేందుకు ధరఖాస్తులు అర్హులైనవారు ధరఖాస్తు చేసుకోవాలని రీజినల్ కోఆర్డినేటర్ పి.యాదయ్యాగౌడ్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్దులు సమీప ఏదేని గురుకుల పాఠశా ల, కళాశాలల్లో ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. అర్హత, అనుభవం ఉన్న అభ్యర్దులకు ఎంపికలో ప్రాధా న్యత కల్పించడం జరుగుతుందన్నారు. డెమో అధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని ఆర్‌సీఓ తెలిపారు.

## కెసిఆర్‌కు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

**కొత్తూర్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** దళితులను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ది చెప్తామని షాద్‌నగర్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ ఎర్రోళ్ల జగన్ తెలిపారు. కొత్తూర్ మండలం గూడూరు గ్రామంలో ఆదివారం రాత్రి యువకులతో కలిసి మాట్లాడారు. దళితబంధు ఎంతమందికి వచ్చిందని ఆరా తీశారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తాను అని చెప్పిన కేసీఆర్ ఎవరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. అదే విధంగా ఒక్కరిద్దరికి దళితబంధు ఇచ్చి తర్వాత మీ అందరికి వస్తుందని ఆశ చూపి మోసం చేస్తునా న్నని మండిపడ్డారు. ఇలాంటి ప్రభుత్వాన్ని భవిష్యత్తు లో ఎవరు నమ్మరు అని అన్నారు. బీఆర్ఎస్‌లో ప్రతి దళిత కార్యకర్త మనసు చంపుకుని కొనసాతున్నారు. దళితులు వచ్చే ఎన్ని కల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని ఘాటుగా విమర్శించారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో వ్యక్తి మృతి

**వర్గల్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ శివరాములు సోదరుడు రాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట జెడ్‌పిటిసి బాలమల్లుయాదవ్, ఎంపిపి లతా రమేష్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ ఇర్రి రామకృష్ణారెడ్డి, మాధవరెడ్డి, స్వామి, నాగరాజు తదితరులు ఉన్నారు.

## జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య

**దుబ్బాక, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** జీవితంపై విరక్తి చెంది బివిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుబ్బాక మండలం హబ్సీపూర్ గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ గంగరాజు కథనం ప్రకారం... ఆదే గ్రామానికి చెందిన గుర్రం ఆనంద్(29) అంగవైకల్యంతో పాటు మానసిక స్థితి బాగలేక జీవితంపై విరక్తి చెంది పొలం వద్ద బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవాడం జరిగిందన్నారు. మృతుడి భార్య భారతి ఫిర్యాదు మేరకు జీవితంపై విరక్తి చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకుని భర్త ఆనంద్ మృతి చెందాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు.

## అదుపుతప్పి లారీ బోల్తా

**ధారూర్ సెప్టెంబర్ 11,ప్రభాతవార్త :** అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటన ధారూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...మండల పరిధిలోని ఎబ్బానూర్ చెరువు సమీపంలోని అతివేగంతో వస్తున్న సిమెంట్ లారీ (టిఎస్ 08 యుజీ 2612)అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ప్రమాదం జరగలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.



నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు

**కొమురవెల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సోమవారం పర్యటించి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను చేశారు. పోసాన్‌పల్లి గ్రామంలో రూ.12 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీహాల్‌కు భూమిపూజ చేశారు. అనంతరం రసులాబాద్‌లో రూ.13.60 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని, రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అలాగే మండలానికి చెందిన 27 మందికి కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిన ఇండ్లకు ప్రభుత్వం ద్వారా వచ్చిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, పార్టీ నాయకులు పచ్చిమడ్ల స్వామి, బిక్షపతి, సిద్దప్ప, తలారి కీర్తన, కాగిత రాజేందర్‌రెడ్డి, సుంకరి మల్లేశం, సురేష్ పాల్గొన్నారు.

## మత్స్యకారుల చైతన్య సదస్సును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు కుమారస్వామి

**బెజ్జంకి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** మానకొండూరు నియోజకవర్గ స్థాయిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహించే మత్స్యకారుల చైతన్య సదస్సుకు ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా నాయకులు పెసరు కుమారస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి దేవాలయంలో సోమవారం ముదిరాజ్ సంఘంనాయకులు అక్కరవేణి పోచయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు కనకయ్య, కీసర సదానందం, కీసర సంపత్, నెల్లి శంకర్, కూన మహేందర్, రాజమౌళి, కూన శంకర్, ముదిరాజ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించండి



అంజిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గౌడ సంఘం సభ్యులు

**ములుగు, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతోపాటు కెసిఆర్ గెలుపునకు కృషి చేస్తున్నామని గౌడ సంఘం జగదేవ్‌పూర్ మండల సభ్యులు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గం జగదేవ్‌పూర్‌లో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన ఫంక్షన్‌హాల్‌కు రూ.కోటి నిధులు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ద్వారా మంజూరు చేయించి సహకరించాలని కోరుతూ ఉమ్మడి మెదక్‌జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డికి వినతిపత్రం సోమవారం ములుగులో అందజేశారు. ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని గౌడ సంఘం తరపున కేటాయించుకున్నట్లు ఆయనకు వివరించారు. హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరుకు తనవంతు సహకారం చేస్తూ సహకరించాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు పిఎసిఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు పి.పాండుగౌడ్, ఉపాధ్యక్షుడు నర్సింలుగౌడ్, ప్రధాన కార్యదర్శి పంజాల రాజుగౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు అర్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా బిఆర్ఎస్ ప్రభుత్వం

**ములుగు, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** దేశంలో ఎక్కడా లేనివిధంగా పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్ అని వంటిమామిడి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు జహంగీర్, డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. ములుగు మండలం అడవిమజీద్ గ్రామానికి చెందిన శ్రీరాములు మృతిచెందగా అతని పేరుపై భూమి ఉండడంతో ఆయన కుటుంబానికి రూ.5 లక్షల రైతుబీమా మంజూరైంది. దానికి సంబంధించిన ప్రొసీడింగ్‌ను సోమవారం సర్పంచ్ షహనాజ్ నజీర్, ఎంపిటిసి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాములు భార్యకు అంజిరెడ్డి, జహంగీర్‌లు జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సలీం, రాష్ట్ర యువత విభాగం అధ్యక్షుడు జుబేర్‌పాషాలతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేష్‌గౌడ్, సీనియర్ నాయకుడు అర్జున్‌గౌడ్, ఉపసర్పంచ్ లతా కిషన్‌గౌడ్, అల్లీనగర్ సర్పంచ్ భూపాల్‌రెడ్డి, నాయకులు మహదేవుని శ్రీనివాస్‌గౌడ్, శంకర్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

### తడకపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపలు,

## ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి హరీష్‌రావు



మంత్రి హరీష్‌రావుకు ఏకగ్రీవ తీర్మానం అందజేస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి గ్రామంలో మంత్రి హరీష్‌రావు సోమవారం పర్యటించి న్యూ అదర్శ్‌రెడ్డి సంఘం, ముదిరాజ్ సంఘం, ఎస్సీ మాలకుల సంఘం భవనాలతోపాటు నూతనంగా నిర్మించిన కుర్మసంఘం, గ్రంథాలయం, హైస్కూల్ భవనాలను ప్రారంభించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, వైకుంఠ ధామాల పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మల్లన్నసాగర్ ద్వారా రెండు పంటలకు నీరు అందిండచంతోపాటు చెరువులను నింపడం జరుగుతుందన్నారు. చదువులకు నిలయంగా సిద్దిపేట మారిందన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కాళేశ్వరం నీళ్లు ఎందుకు రాలేదు.. సిద్దిపేట మెడికల్ కాలేజీ ఎందుకు రాలేదన్నారు. తిరిగి సిద్దిపేటలో ఎమ్మెల్యేగా హరీష్‌రావును ఎన్నుకుంటామని తడకపల్లి గ్రామంలో కురుమ సంఘం నాయకులు ఏకగ్రీవ తీర్మాణం చేసి మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు

**కొమురవెల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన అన్న పూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో బాలాజీ, చైర్మన్ గీస బిక్షపతి, ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ అధికారులు, సిబ్బంది, శ్రీనివాస్, నీల చంద్రశేఖర్, అర్చకులు, వీరశైవ ఆగమ పాఠశాల విద్యార్థులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలి

### సిఐటియు రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి



నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనట్లయితే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని సీడీపీఓ కార్యాయలం ఎదుట నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా సమ్మెకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. సిఎం కెసిఆర్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడానికి టీచర్స్ అని పేరు పెట్టారే తప్ప పేస్కేలు, ఉద్యోగ భద్రత తదితర అంశాలను విస్మరించారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లతో వెట్టిచాకరి చేయించుకోవడం తప్ప వారి సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.13650 ఇస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లోఉన్న టిఎ, డిఎలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, అంగన్‌వాడీటీచర్లు, ఆయాలు కళావతి, లక్ష్మీ, శారద తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న అంగన్‌వాడి టీచర్లు తదితరులు

## అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### సిఐటియు జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కడారి నాగరాజు

**నర్సాపూర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** అంగన్‌వాడి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా నర్సాపూర్‌లో అంగన్‌వాడి ఉద్యోగులు సోమవారం సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడి ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో వారు రాష్ట్రంలో జెఏసిగా ఏర్పడి నేటి నుండి సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మెను విచ్చిన్నం చేయడానికి అంగన్‌వాడి సెంటర్లను అధికారులే తాళాలు పగులగొట్టి నడిపించడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఏదిఏమైనా సమ్మెను నిర్వహిస్తామని తెలిపారు. ప్రధానంగా అంగన్‌వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు రూ. 26 వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని కోరుతూ ప్రభుత్వానికి సమ్మె నోటీస్ చట్టప్రకారం అందించామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు అన్నపూర్ణ,విజయ, వరలక్ష్మి, ఫరీధా, సువర్ణ, ధనలక్ష్మి, విజయ, మంజుల,స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు పనికిదగ్గ వేతనం ఇవ్వడం లేదు



పోలీసుల అదుపులో ఉన్న ఆశా వర్కర్లు

**కొల్చారం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** ఆశా వర్కర్లకు పనికి దగ్గ వేతనం ఇవ్వడం లేదని ఆశా వర్కర్లు సౌందర్య, గీతలు అన్నారు. యూనియన్ పిలుపు మేరకు ఛలో హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో కొల్చారం పోలీసులు ఏఎస్ఐ వాణి ఆధ్వర్యంలో ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు సౌందర్య, గీతలు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి పొట్ట నింపని ఉద్యోగాన్ని నమ్ముకొని జీవితాన్ని వెల్లదీస్తున్నామని అన్నారు. కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. యూనియన్ పిలుపు మేరకు తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఛలో హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, రమ్య, లలిత, కవిత, విజయ, నాగమణి, చంద్రకళ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయనిధి స్టాలిన్ మాటలు హిందూ సమాజాన్ని కించపరచడమే

**మెదక్ అర్బన్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** ఉదయనిధి స్టాలిన్ మాటలు యావత్ హిందూ సమాజాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని బీజేపీ జిల్లా ఇంచార్జి డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అన్నారు. సోమవారం మెదక్ పట్టణంలోని భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జి డాక్టర్ ఎస్. మల్లారెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఉదయనిధి స్టాలిన్ మాట్లాడినటువంటి మాటలు యావత్ హిందూ సమాజాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని, హిందూ ధర్మం క్షయ, క్యాన్సర్ రోగాల లాంటిదని వక్రీకరించినటువంటి ఉదయనిధి స్టాలిన్‌ను బర్తరఫ్ చేయాలని, చట్టరీత్యా శిక్షించాలని, అతడు చేసిన వాఖ్యలు భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే హిందూ సమాజం మౌనంగా ఉండదని హెచ్చరించారు. హిందూ ధర్మం నుంచి అనేక మతాలు ఉద్భవించా యని, హిందూ సంస్కృతిని ప్రపంచంలోని అనేక దేశాలు కొనియాడుతుంటే మన దేశంలో ఉన్న ఈ మూర్ఖుడు విమర్శించడం సరికాదన్నారు. వెంటనే ఇతనిపై అనర్హత వేటు వేసి బర్తరఫ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలయ్య, కరణం పరిణీత, జిల్లా ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రెడినడ, విజయ్, మాజీ అధ్యక్షులు రామ్‌చరణ్, సీనియర్ నాయకులు రఘువీరారెడ్డి, సుభాష్ చంద్ర బోస్, బైండ్ల సత్యనారాయణగౌడ్, రాజేందర్, రమేష్‌గౌడ్, నాగిని ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఇంచార్జి డాక్టర్ మల్లారెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న విగ్రం రాజన్‌గౌడ్

## బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రటరీగా విగ్రం రాజన్‌గౌడ్

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రటరీగా పెద్దశంకరంపేటకు చెందిన విగ్రం రాజన్‌గౌడ్ నియామితులయ్యారు. రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని ఆయన తీసుకున్నారు. బీసీ కులాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ శివకృష్ణాగౌడ్, బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## పత్తి పంటను పరిశీలించిన ఎవో

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్11 ప్రభాతవార్త:** రైతులు పత్తి పంట సాగు చేసేటప్పుడు యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని పెద్దశంకరంపేట మండల వ్యవసాయాధికారి రాజేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిరుమలాపూర్‌లో పత్తి పంటను ఆయన పరిశీలించారు. పత్తి పంటలో ప్రధానంగా ఎర్ర నల్లి, తామర పురుగులు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని, వర్షాలు అధికంగా ఉన్న సమయంలో చలి వాతావరణంలో పంటను పాడుచేస్తాయని రైతులకు వివరించారు. తామర పురుగుల నివారణకు వాడాల్సిన మందుల గురించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రైతులు పంటలు సాగుచేస్తున్నప్పుడు ఏమైనా ఇబ్బందులు ఉంటే వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** మండలంలోని రైతులు యూరియా కోసం ఆందోళన పడవలసిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి వసంతరావు అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండలంలోని పలు ఎరువుల దుకాణాలను సందర్శించి ఈ-పాస్ మిషన్‌లోఉన్న నిల్వలను, గోదాములో నిల్వ ఉంచిన యూరియా బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 85 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, యూరియా కొరకు ఎవరూ ఆందోళన పడవద్దని రైతులకు సూచించారు. కొందరు రైతులు యూరియా దొరకడంలేదని అధికమొత్తంలో బస్తాలను కొనుక్కొని నిల్వ ఉంచుకుంటున్నారని, ఎవరూ ఎక్కువ మొత్తంలో నిల్వ ఉంచుకోవద్దని, రైతులు యూరియా అధిక మొత్తంలో వాడినట్లయితే తెగుళ్ళు, పురుగుల ఉధృతి పెరిగి పంట నష్టం జరుగుతుందని తెలిపారు. అధిక దిగుబడులు పొందాలంటే వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎకరానికి సగం బస్తా లేదా ఒక బస్తా యూరియా మాత్రమే వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మహ్మద్ కలీల్, దుకాణ యజమానులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికే వార్డుల పర్యటన

### మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :** మున్సిపాలిటీలోని సమస్యల పరిష్కారానికే ప్రతి సోమవారం ఒక వార్డు పర్యటన కార్యక్రమం చేపట్టినట్లు రామాయంపేట మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం నాడు మున్సిపాలిటీ పరిధిలోని 10 వార్డులో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన వార్డులోని సమస్యలను ప్రజలనుండి అడిగి తెలుసుకున్నారు. ప్రతి వీధిలో తిరుగుతూ సమస్యలపై క్షుణ్ణంగా ఆరాతీసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కారం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వార్డులలో నెలకొన్న సమస్యలు వీలైనంత తొందరలోనే తీరుస్తామన్నారు. చిన్నపాటి సమస్యలను సత్వరమే చేపడుతున్నట్లు తెలిపారు. పెద్ద సమస్యలను పాలకమండలి, అధికారుల సమక్షంలో చర్చించి అన్నివార్డులలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పరంగా అమలయ్యే పథకాలకు సంబంధించి ప్రజలకు అందరికీ న్యాయం చేసేవిధంగా కృషిచేస్తామన్నారు. అందుకు సంబంధించిన దరఖాస్తులను ప్రజలనుండి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చింతల రాధాభవాని యాదగిరి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఇతర వార్డు కౌన్సిలర్‌లు, మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది, ఆఫీసర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్, ఏఎన్ఎంలు, విద్యుత్ సిబ్బంది, నీటి సరఫరా సిబ్బంది, శానిటేషన్ సిబ్బందితో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మెన్ జితేందర్‌గౌడ్

# సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదు

### బిజెపి జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిజెపి నాయకులు

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** సనాత ధర్మాన్ని కించపరిచే విధంగా ఎవరూ మాట్లాడినా సహించేది లేదని బిజెపి జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వెంటనే హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు సమీపంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జై శ్రీరాం..భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా హిందూ ధర్మాన్ని కించపరుస్తూ మాట్లాడితే సహించేది లేదన్నారు. రాజ్యాంగ పదవిలోని వ్యక్తి శ్రీరాముడు, శ్రీకృష్ణుడికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. హిందువులు ఐకమత్యంగా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. హిందూ సమాజం మేల్కొని సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ కుట్రలు పన్నుతున్నవారిని తరిమికొట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్‌రావు, లక్కిరెడ్డి తిరుమల, తొడుపునూరి వెంకటేశం, వేణుగోపాల్, విజయ్ పాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, శంకర్, వీరచారి, వేణుగోపాల్, నరేష్, యాదన్ రావు, కృష్ణ, పద్మ, సుగుణ, జ్యోతి పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

**నంగునూర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు దాతలు సేవలందించడం అభినందనీయమని సర్పంచ్ నారోజు విజయలక్ష్మీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొండంరాజుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని 78 మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన దాత సెల్వని సతీష్‌కుమార్ రూ.21 వేల విలువ చేసే క్రీడా దుస్తులను, ఐడీకార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్య, క్రీడారంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపిటిసి ప్రియాంక, ఎస్ఎంసి చైర్మన్ తిరుపతి, నాయకులు బ్రహ్మచారి, ఉపాధ్యాయులు రజిత, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబీకులను పరామర్శించిన చాడ వెంకటరెడ్డి

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ తండ్రి రాజమల్లయ్య గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి సీపీఐ నాయకులతో కలిసి బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అయన వెంట సీపీఐ నాయకులు కనుకుంట్ల శంకర్, జేరిపోతుల జనార్దన్, బోనగిరి రూపేష్, కర్నాల చంద్రం, సంగెం మధు, మిట్టపల్లి సుధాకర్, బిక్షపతి, ఐలయ్య తదితరులు ఉన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడు నరేందర్ : ఎంఇవో

**మర్కుక్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాలలో టిజిటి తెలుగు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న నరేందర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనట్లు ఎంఈఓ ఉదయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు సుమారు రూ.20వేల విలువైన ఫ్యాన్‌లు, 176 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, 35 మంది విద్యార్థులకు పెన్సిల్‌లు ఉత్తమ ఉపాధ్యాయుడు నరేందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంఈఓ ఉదయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ దుద్దెడ లక్ష్మిరాములుగౌడ్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయుడు నరేందర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఓంకార్‌రాధాకృష్ణ, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, చిన్నికృష్ణ, హారిక, పాల్గొన్నారు.

## మంత్రి కెటిఆర్‌పై పోటీకి బిజెపి నుంచి దరఖాస్తు చేసుకున్న అశోక్ సాదుల



ఎమ్మెల్యే స్థానానికి దరఖాస్తు చేసుకుంటున్న అశోక్ సాదుల

**శివ్వంపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామానికి చెందిన అశోక్ సాదుల సిరిసిల్ల నియోజకవర్గం నుండి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం అశోక్ సాదుల మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌పై పోటీచేయనున్నట్లు సోమవారం ఆయన మీడియాకు తెలిపారు. మంత్రి కేటీఆర్ తెలంగాణలో ఉన్న నిరుద్యోగులను భర్తీ చేయలేకపోయారని, నిరుద్యోగ భృతి 3,016 రూపాయలు ఇస్తామని మాట తప్పడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగాల విషయంలో చార్మినార్ రంగారెడ్డి జోన్ 6లో ఉన్న మెదక్‌ను తీసుకెళ్లి సిరిసిల్ల కరీంనగర్ జోన్ 3లో కలపడం జరిగిందని ఆయన అన్నారు. నిరుద్యోగుల తరపున మెదక్ జిల్లాకు పూర్తిగా అన్యాయం జరుగుతుందని అశోక్ సాదుల చెప్పారు. రాష్ట్రంలోని యువకుల తరపున బీజేపీ నుండి కేటీఆర్‌పై పోటీ చేస్తున్నానని ఆయన చెప్పారు. నిజామాబాద్‌లో రైతులకు కవితను ఎలా ఓడించారో అదేవిధంగా సిరిసల్లలో తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులు అందరం కలిసి కేటీఆర్‌ను ఓడిస్తామని, దీనిని దృష్టిలో ఉంచుకొనే కేటీఆర్‌పై తాను పోటీకి దరఖాస్తు చేసుకున్నానని అశోక్ సాదుల తెలిపారు.

## ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కెసిఆర్ ప్రభుత్వం

### -కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్

**శివ్వంపేట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడకంచి సుదర్శన్‌గౌడ్ అన్నారు. సోమవారం జేకే గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మళ్లీ పూర్వ వైభవం వస్తుందన్నారు. నర్సాపూర్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని, పార్టీ అధిష్టాన వర్గం ఏ అభ్యర్థిని ప్రకటించినా గెలుపు కోసం అందరం కలిసి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అన్నివర్గాల ప్రజలకు పూర్తి న్యాయం జరిగిందని ఆయన గుర్తుచేశారు. పథకాల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఆయన ఆరోపించారు. శివ్వంపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, కార్యకర్తలు ఆత్మస్థైర్యంతో పనిచేసి ముందుకు వెళ్తుందన్నారు. బంగారు తెలంగాణ అని చెబుతున్న కేసీఆర్ అన్ని ప్రాంతాలను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని సుదర్శన్‌గౌడ్ ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరావు, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భాసంపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు భానూరి నారాగౌడ్, మంతూరి రమేష్‌గౌడ్, భావన్నగారి శ్రీనివాస్, సుక్క శ్రీనివాస్, కందికొండ అశోక్, తిరుపతి రాథోడ్, రాఘవరెడ్డి, పల్లె జయరాములు, డీలర్ చాంద్‌పాషా, రామాగౌడ్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

### -తపస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్11 ప్రభాతవార్త:** ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని తపస్ మెదక్ జిల్లా అధ్యక్షులు జిడ్డి ఎల్లం అన్నారు. సోమవారం మెదక్ కలెక్టరేట్ ముందు ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిర్వహిస్తున్న ధర్నాకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌ల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులు ఏండ్ల తరబడి పనిచేస్తున్నా క్రమబద్ధీకరణకు నోచుకోలేదని, విద్య మన హక్కు అందరూ చదవాలి.. అందరూ ఎదగాలనే అనే నినాదంతో ఏర్పడిన సర్వ శిక్షా అభియాన్‌లో దశాబ్ధ కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేనతాలు అందని ద్రాక్షలా మారాయన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం అమలు చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, విద్యాశాఖ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, మాధవరెడ్డి, ఎస్ఎస్ఏ రాష్ట్ర జేఏసీ అధ్యక్షురాలు కవిత, జిల్లా ప్రధాన కార్యదర్శి పాషా, గట్టయ్య, ప్రవీణ్, రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షులు ఎల్లం

# నేడు చెరుకు రైతుల మహాధర్నా

### మద్దతు ప్రకటించిన పార్టీలు

**జహీరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** ఈ నెల 12వ తారీఖున చెరుకు రైతులు నిర్వహించే మహాధర్నాకు రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. మండల పరిధిలోని కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం చెరుకు రైతులకు 9.5 కోట్ల రూపాయలను బకాయిలను వెంటనే చెల్లించాలని, కర్మాగారాన్ని త్వరలో ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నియోజకవర్గంలోని చెరుకు రైతులతో కలిసి పట్టణంలోని పిఎస్ఆర్ గార్డెన్ నుండి ఉదయం 10.30 గంటలకు ర్యాలీ ప్రారంభించి పట్టణంలోని జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ వంతెన వద్ద (బాగారెడ్డి చౌరస్తా)లోని మాజీ మంత్రి యం బాగారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జాతీయ రహదారిపై ధర్నా నిర్వహిస్తామని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. రైతుల మహాధర్నాకు ఈ పాటికే కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించగా సోమవారం భారతీయ జనతా పార్టీ నాయకులు, మాజీ డిసిసిబి చైర్మన్ యం జైపాల్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచందర్ రాజనర్సింహ పార్టీ తరఫున మద్దతు ప్రకటించారు. టీజేఎస్ నాయకులు మొగుడంపల్లి ఆశప్ప, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు సిద్ధూరావులు సైతం రైతుల ధర్నాకు మద్దతు ప్రకటిస్తున్నట్లు ప్రకటించారు. రైతుల మహాధర్నాకు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి రైతులు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయా పార్టీల నాయకులు పిలుపునిచ్చారు.

## ఎల్ఓసిలు అందజేసిన బిఆర్ఎస్ నాయకులు



సిఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**పుల్కల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సూర్‌రెడ్డి ఇటిక్యాల గ్రామానికి చెందిన గంగగ్గారి విజయ అనారోగ్యంతో అవస్థలు పడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ బాధితురాలు మెరుగైన చికిత్స అందుకునేందుకు సిఎంఆర్‌ఎఫ్ పథకంలో 30వేల రూపాయలను మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసి చెక్కును ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆదేశాల మేరకు సోమవారం విజయ కుటుంబ సభ్యులకు బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. గ్రామ సర్పంచ్ రాధయ్య, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు నర్సింలు, నాయకులు మోహన్‌రెడ్డి సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**పుల్కల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** ఈ నెల 12వ తారీఖున మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ జయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి మండల సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి నివేదికలతో సమావేశానికి విధిగా హాజరుకావాలని ఎంపిడిఓ సూచించారు.

## ఎంపి బిబి పాటిల్‌ను కలిసిన చైర్మన్ నరోత్తం

**జహీరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన వై నరోత్తం జహీరాబాద్ ఎంపి బిబి పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని ఎంపి నివాసానికి చేరుకున్న నరోత్తంను ఎంపి బిబి పాటిల్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ మసూద్ హుస్సేన్, గోవర్ధన్‌రెడ్డి, బాసిత్, ప్రసాద తదితరులు పాల్గొన్నారు.

## రవాణా సౌకర్యం కొరకు ఆటో ఏర్పాటు చేసిన సర్పంచ్



ఆటోను ప్రారంభం చేస్తున్న ఎన్ఎంఆర్ యువసేన

**గుమ్మడిదల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ః** గుమ్మడిదల మండల కేంద్రములోని రాంనగర్ కాలనీ నుండి ప్రైమరీ స్కూల్ మెయిన్‌రోడ్డు వరకు కనీసం 2 కిలోమీటర్ల దూరం ఉన్నందున విద్యార్థులు కాలినగకన వెళ్తూ ఇబంది కలుగుతుందని గ్రహించి ఈ విషయం శ్రీరామయూత్ సభ్యులు, రామ్‌నగర్ కాలనీ వాసులు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు రావాణా సౌకర్యం కల్పించమని కోరడం జరిగింది. కాలనీ వాసుల కోరిక మేరకు వెంటనే స్పందించి బడి పిల్లల రవాణా కొరకు రాంనగర్ కాలనీ నుండి ఆటోను గుమ్మడిదల నాయకులు దేవుని చెరువు నర్సింలు ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం రోజు ప్రారంభించడం జరిగింది. తమ పిల్లలకు విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించినందుకు కాలానీ వాసులు చిట్కుల్ నీలం మధుకు ప్రత్యేక దన్యవాదాలు. ఈకార్యక్రమంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు గ్యారల మల్లేశ్, జింకగోపాల్, చింతల వీరేష్, తుజాల్‌పూర్ వీరేశ్, ఉప్పరి నాగారాజు, తుడుం శ్రీనివాస్, కుమ్మరి వెంకటేష్, కె.సురేష్, శ్రీకాంత్‌గౌడ్, విజయ్, భద్రయ్య, వితల్, కె. అంజనేయులు, ప్రశాంత్, ధనుంజయ్, శ్రీకాంత్, మద్దూరి ఆంజనేయులు, దుర్గయ్య, శంకరయ్య, రవి, రాజు, శంకర్, వీరేశ్, యూసుఫ్‌కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ ఆచూకీ తెలుపండి

### పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**చిన్నశంకరంపేట,సెప్టెంబరు 11,ప్రభాతవార్త:** మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి గత కొన్ని నెలలుగా కనిపించడం లేదని చిన్నశంకరంపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోహన్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ మెదక్ ఎంపిగా గెలిచనప్పటి నుండి ప్రజల సమస్యలను విన్నవించుకుందామంటే అందుబాటులో ఉండటం లేదని, నియోజకవర్గాన్ని కనీసం తోంగి చూడటం లేదని వార ఆరోపించారు.ఎంపీ నిధులను మొత్తం దుబ్బాక నియోజకవర్గానికే పరిమితమైతే మిగతా నియోజకవర్గాల పరిస్థితి ఎంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పిపోయిన ఎంపీ ఆచూకీ తెలపాల్సిందిగా ఫిర్యాదులో పేర్కొన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నశంకరంపేట మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రవిచంద్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగాయపల్లి రమేష్, మేడి సాయి, యూత్ కాంగ్రెస్ నాయకులు బానోత్ మోహన్, బిక్య,సురేష్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోల్కంపల్లిలో పల్లె పల్లెకు త్రిషమ్మ

**మునిపల్లి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** ఈ నెల 12వ తారీఖున పోల్కంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పల్లె పల్లెకు త్రిషమ్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల యూత్ కమిటి అధ్యక్షులు రాజు పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ తనయ త్రిష గ్రామానికి చేరుకుని కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమ విజయవంతానికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, దామోదర్ రాజనర్సింహ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాని రాజు సూచించారు.





మునిపల్లి, న్యాల్‌కల్ మండల కార్యాలయాల ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



చిన్నశంకరంపేటలోని పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

**మునిపల్లి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్ వాడి టీచర్లు సోమవారం ధర్నాకు పూనుకున్నారు. మండల కార్యాలయం ముందు 25 డిమాండ్లను పరిష్కరించాలని ధర్నాకు దిగిన అంగన్‌వాడి టీచర్లు మాట్లాడుతూ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫి ట్స్ టీచర్లకు 10 లక్షలు, హెల్పర్లకు 5లక్షలు చెల్లించాలని, రిటైర్మెట్ వయసు 60 సంవత్సరాలకు నిర్ణయించాలని, ప్రమాద భీమా సౌకర్యం 5లక్షలు చెల్లించాలని డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్క రించాలని అంగన్‌వాడి టీచర్లు శకుంతల, ఎన్ మంజుల, ఉమాశ్రీ, ఈశ్వరమ్మ, శివకళ, లక్ష్మిలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నాగమణి, లక్ష్మి, మీనాక్షి కమల, విజయలక్ష్మి, అలవేణి, వెంకటమ్మ, నాగలత పుష్పలత, రజిత, రేణుక పాల్గొన్నారు.

### న్యాల్‌కల్‌లో..

**న్యాల్‌కల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** తమ న్యాయమైన 25 డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడి టీచర్లు సీఐటియ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం న్యాల్‌కల్‌లోని రెవిన్యూ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సంగయ్య మాట్లాడుతూ కనీస వేతనం 26వేల రూపాయలు చెల్లిస్తూ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి యూనియన్ అధ్యక్షులు శోభ, విజయ లక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు కమలమ్మ, పద్మ, అనసూయ పాల్గొన్నారు.

### చిన్నశంకరంపేటలో..

**చిన్నశంకరంపేట,సెప్టెంబరు 11,ప్రభాతవార్త:** ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు దేవమ్మ డిమాండ్ చేశారు. కమీషనర్ కార్యాలయ ముట్టడికి వెళ్తున్న ఆశా కార్యకర్తలను సోమవారం పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు చేసిన తమను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కనీసం ప్రసూతి సెలవులు కూడా ఆశాలకు వారం రోజులు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగ భద్రత, భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### సిఐటీయు ఆధ్వర్యంలో..

**గుమ్మడిదల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ః** గుమ్మడిదల మండలంలోని సిఐటీయు జిల్లా యూనియన్ అధ్యక్షులు పి.వరలక్ష్మి, జి. సాయిలు, గౌరవ అధ్యక్షులు వరలక్ష్మి, కార్యదర్శి వై.యశోద పిలుపు మేరకు పనిచేయు ఆశ వర్కర్లు సోమవారం రోజున హైదరాబాదులో జరిగే కమీషనర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని వెళుచుండగా స్థానిక పోలీసులు అడ్డగించి అరెస్టు చేశారు. ఈ సందర్బంగా ఆశ వర్కర్లు అంజమ్మ, ఎంటికే మరిమ్మ మాట్లాడుతూ ఆశ వర్కర్ల చేత పనిభారం పెంచుతున్నారని కనీస గౌరవ వేతనం ఇవ్వకుండా గుడ్డ చాకిరి చేయిస్తున్నారని ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. తక్షణ ప్రభుత్వం ఆశ వర్కర్ల పనితనం గురించి తగిన వేతనం సుమారు 18 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేస్తున్న అక్రమ అరెస్టులకు అధైర్య పడకుండా ప్రభుత్వం ద్వారానే ప్రభుత్వం ఆశ వర్కర్లుగా గుర్తించింది. ఈ కార్యక్రమంలో రాణి, జ్యోతి, మంజుల, పునమ్మ, విజయలక్ష్మి, లావణ్య, గంగమ్మ, మంజుల, యాదమ్మ, ఇంద్రాణి, నాగమణి, సునీత పాల్గొన్నారు.





ఆశ వర్కర్లను అరెస్టు చేసిన దృశ్యం



సమావేశంలో పాల్గొన్న చేర్యాల న్యాయవాదులు

## చేర్యాల న్యాయవాదుల నూతన కార్యవర్గం ఎన్నిక

### బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూమిగారి మనోహర్

**చేర్యాల, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** చేర్యాల న్యాయవాదుల నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం కోర్టుకోసం కేటాయించిన ఎంపిడివో కార్యాలయ భవనం ప్రాంగాణంలో ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది భూమిగారి మనోహర్, ఉపాధ్యాక్షుడిగా మెరుగు రమేష్,ప్రధాన కార్యదర్శిగా తాటికొండ ప్రణీత్, సహాయ కార్యదర్శిగా పర్వతం రాములు, కోశాధికారిగా పొన్నం సురేష్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా అంకని సురేందర్ కార్యవర్గ సభ్యులుగా నల్లగొండ సంతోస్, ఉట్కూరి అమర్, అనంతోజు వెంకట కృష్ణ, గుస్క వెంకటేష్, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు యస్. జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి చేర్యాల కోర్టును అతి త్వరగా ప్రారంభించాలని కోరారు. అనంతరం సిద్దిపేట న్యాయవాదులు నూతన కమిటిని అభినందించారు.

## రిలే నిరాహార దీక్షలు ప్రారంభించిన జేఏసి నాయకులు



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న జేఏసి చైర్మన్ పరమేశ్వర్

**చేర్యాల, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** రెవెన్యూ డివిజన్ సాధన కోసం జేఏసి నాయకులు సోమవారం రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. అనంతరం రెవెన్యూ జేఏసి నాయకులు మాట్లాడుతూ ఆమరణ నిరాహార దీక్షలకు కూడా సిద్ధమని చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ నాయకులు ఆముదాల మల్లారెడ్డి, మాజీ జెడ్పీటీసి దాసరి కళావతి, కొమ్ముసర్సింగరావు, అందె అశోక్ తెలిపారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ సోమవారం జేఏసి ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్షలను జేఏసి చైర్మన్ పరమేశ్వర్ ప్రారం భించారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

### -సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు

**కొండాపూర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** అంగన్‌వాడి ఉద్యోగుల న్యాయమైన 25 డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన కొండాపూర్‌లోని రెవిన్యూ కార్యాలయం ముందు అంగన్‌వాడి టీచర్లు, వర్కర్లు డిమాండ్లను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు 10 లక్షలు, హెల్పర్లకు 5లక్షలు చెల్లించాలని, రిటైర్మెట్ వయసు 60సంవత్సరాలకు నిర్ణయించాలని, ప్రమాద భీమా సౌకర్యం 5లక్షలు చెల్లించాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబురావు, గ్రామ పంచాయితీ యూనియన్ నాయకులు వెంకయ్య, సంజీవులు, ఇందిరా క్రాంతి పథకం నాయకులు ఏసుమని, భ్రమరాంబ, అరుణ, లక్ష్మి, ఆయలు పాల్గొన్నారు.

### నార్సింగి ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీపీ సబిత

**నార్సింగి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ః** నార్సింగి మండల కేంద్రంలో సోమవారం ఎంపీపీ చిందం సబితా రవీందర్ న్యాక్ ఉచిత కుట్టుమిషన్ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అందులో ఉచితంగా నేర్చుకుంటున్నా 30 మంది మహిళలను వారు నేర్చుకున్న పనిని అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి వసతుల కొరకు అడిగి తులుసుకున్నారు. 90 రోజుల ఉచిత కుట్టు మిషన్ శిక్షణ నెల రోజులలోనే చక్కగా నేర్చుకున్నారని వారిని అభినందించారు. చక్కగా నేర్చుకొని కుటుంబాన్ని పోషించుకోవాలని పేర్కొన్నారు. మగ్గం వర్క్, అల్లిక వర్క్ మంచిగా నేర్చుకోవాలని పేర్కొన్నారు. న్యాక్ ఉచిత శిక్షణ శిబిరం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న మహిళలకు లేబర్ కార్డు ఉండాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

# ఎన్నికలొస్తేనే దామోదర్‌కు ప్రజలు గుర్తుకు వస్తారు

### విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

**మునిపల్లి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** ఎన్నికలు వస్తేను మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహాకు ప్రజలు గుర్తుకు వస్తారని, దామోదర్ రాజనర్సింహా గారడి మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. సోమవారం స్థానిక విలేఖరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసిఆర్ పాలనపై దామోదర్ రాజనర్సింహా నిందలు వేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వానికి కితాబు ఇచ్చినా కాంగ్రెస్‌కు అది కానరావడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గంలోని గ్రామాల రోడ్లు, అభివృద్ధి స్థితిగతులు ఎలా ఉండేవో, ఇప్పుడెలా అభివృద్ధి బాటలో దూసుకుపోతున్నాయో కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కేసిఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని, గత కాంగ్రెస్ హయాంలో అందరికి అభివృద్ధి ఫలాలు అందాయా అని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు గౌడిగామ శ్రీలత శివశంకర్, జడ్పీటిసి సభ్యులు పైతర మీనాక్షి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి శశికుమార్, నాయకులు పైతర సాయికుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారుల పాత్ర గొప్పది

### ఎంపిపి సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్





మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**బెజ్జంకి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారుల పాత్ర ఎంతో గొప్పదని..స్వాతంత్ర్యం సాధించి 75 యేండ్లు పూర్తి చేసుకున్న కనీస మౌలిక వసతులు కూడా లేని గ్రామాలను తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం అన్ని రకాల హంగులతో బిఆర్ఎస్ ప్రభుత్వం తీర్చి దిద్దడం జరుగుతుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపిపి కార్యాయలంలో ఎంపిపి లింగాల నిర్మల అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీల బిల్లులను త్వరలోనే చెల్లించడం జరుగుతుందని సర్పంచ్‌లు అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బ తిన్న రోడ్లు, కల్వర్టులను గుర్తించి త్వరలోనే మరమ్మత్తులు చేస్తామన్నారు. దళితబందు, బిసి బందు, గృహాలక్ష్మి వంటి పథకాలు నిరంతర ప్రక్రియ అన్నారు. ప్రతి కులానికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. మండల అభివృద్ధికి మంత్రి తన్నీరు హరీష్‌రావు ఎంతో సహకారం అందిస్తున్నారని తెలిపారు. 124 సర్వే నంబరులో భూమి కోల్పోయిన 30 బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఎంపిటిసి కొలిపాక రాజు, గాగిల్లాపూర్, తిమ్మాయిపల్లి లింక్ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని ఎ ంపిటిసి కొమిరే మల్లేశం, రేగులపల్లి నుంచి మల్లంచెరువు వరకు తారు రోడ్డును నిర్మించాలని సర్పంచ్ జెల్ల ఐలయ్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కరానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఎంపిడిఓ కార్యాలయాన్ని నూతన హంగులతో తీర్చిదిద్దిన ఎంపిడిఓ దమ్మని రామును ఎమ్మెల్యే రసమయి అభినందించారు. ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు లింగాల నిర్మల, కనగండ్ల కవిత, దమ్మని రాము, కచ్చు చంద్రకళ, పాకాల మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా నరేందర్‌గౌడ్

**పటాన్‌చెరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ః** పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ ఆధ్వర్యంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ గంగు రమేష్ పార్టీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ సమక్షంలో సోమవారం నాడు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా యనగండ్ల నరేందర్‌గౌడ్‌ను నియమించారు. ఈ సందర్బంగా పలువురు కాంగ్రెస్ పార్టీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



అంకెనవల్లి సుశీలకు ఎల్ఓసి అందజేస్తున్న చింత ప్రభాకర్

## రూ. 2.50లక్షల ఎల్ఓసి అందజేత

**సదాశివపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** ఆపత్కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం అండగా ఉంటుందని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పోరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్ అన్నారు. సోమవారం మండలంలోని అంకెనపల్లి గ్రామానికి చెందిన సుశీల ఆనారోగ్యంతో అవస్థలు పడుతున్నట్లు తెలుసుకున్న చింత ప్రభాకర్ మెరుగైన చికిత్స అందుకునేందుకు సదాశి వపేటలోని తన క్యాంప్ కార్యాలంలో సుశీల కుటుంబ సభ్యులకు 2లక్షల 50వేల రూపాయల ఎల్ఓసిని అందచేశారు. ఈ సందర్బంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ పేదలు అనారోగ్యానికి గురైతే మెరుగైన చికిత్స అందుకునేందుకు సిఎంఆర్ఎఫ్ చేయుతగా ఉంటోందన్నారు. ఎల్ఓసి మంజూరు చేయించిన చింత ప్రభాకర్‌కు సుశీల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి భానుప్రకాష్, ఉప సర్పంచ్ మల్లేశం, ఎంటిటిసి సభ్యులు ఆహ్మద్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సలావోద్దిన్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భవాని మాత షష్టమ వార్షికోత్సవం

### ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే



భవాని మాతను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**కంది, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని కోలంపేట గ్రామంలో శ్రీ భవాని మాత ఆలయ షష్టమ వార్షికోత్సవ ఉత్సవాలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయ అర్చకులు భవాని మాత కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని వేద మంత్రాలు వల్లిస్తూ భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. కార్యక్రమానికి సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పోరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న చింత ప్రభాకర్‌ను ఆలయ కమిటి, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, జడ్పీటిసి సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పట్నం మాణిక్యం, మనోహర్ గౌడ్, పేరమాళ్ళ నర్సింలు గ్రామ భక్తులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీటీసీ

**నార్సింగి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ః** నార్సింగి మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం (ఒంటిగుడి) 6వ వార్షికోత్సవ కార్యక్రమానికి జడ్పీటీసీ బానాపురం కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా దేవాలయంలో చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ ఎర్రం అశోక్‌గుప్తా, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మైలారం బాబు, ఉప సర్పంచ్ కాలేరు యోగి, మాజీ ఉప సర్పంచ్ మంచికట్ల విజయ్‌కుమార్, ఎర్రం వెంకటే ష్, ధర్మాకర్ నాగోజి, గణపురం సిద్దిరెడ్డి, ఎర్రం శంకర్, నారాయణ్‌రెడ్డి, స్వామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎర్రం దక్షిణమూర్తి పాల్గొన్నారు. అనంతరం నార్సింగి పట్టణంలో నిర్వహించిన మాజీ ఎంపీటీసీ ఆకుల మల్లేష్‌గౌడ్ తండ్రి ఆకుల బుచ్చగౌడ్ దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయి బుచ్చగౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మల్లేష్‌గౌడ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సొసైటీ చైర్మెన్ శంకర్‌గౌడ్, పార్టీ నాయకులు సిద్దు, యూత్ నాయకులు రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## కూలిపోయిన ఇండ్లకు చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ

**గుమ్మడిదల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ః** సోమవారం రోజున గుమ్మడిదల మండల తహశీల్దారు కార్యాలయం ప్రాంగణంలో గుమ్మడిదల మండలంలోని గ్రామాలలో వర్ష ప్రభావం వలన కూటిపోయిన ఇండ్ల ప్రజలకు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్ది ప్రవీణ, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ పాలక వర్గ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తెమెట్టెలు అందజేత

**చిన్నశంకరంపేట,సెప్టెంబరు 11,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి గ్రామానికి చెందిన లస్మగల నాగమ్మ,నర్సింలుల మేనకొడలు మమత వివాహనికి మైనంపల్లి సోషల్ సర్వీస్ చైర్మన్ మైనంపల్లి రోహిత్ రావు పుస్తె మట్టెలను అందించగా ఎమ్ఎస్ఎస్‌వో సభ్యులు సోమవారం నాడు అందించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, జనార్ధన్, యాదగిరి, నర్సింలు, శేఖర్,అశోక్,పోచయ్య, నాగులు ఎమ్ఎస్ఎస్‌వో సభ్యులు పాల్గొన్నారు.

## వీరభద్రుని ఆలయంలో సప్త భజనలు, ప్రత్యేక పూజలు

**అల్లాదుర్గం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త ః** అల్లాదుర్గంలోని పురాతన దేవాలయమైన వీరభద్ర స్వామి ఆలయంలో ప్రజలు సప్త భజన నిర్వహిస్తున్నారు. శ్రావణమాసంను పురస్కరించుకొని పగలు, రాత్రి భజనలతో శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణమంగా మారుమ్రోగుతున్నాయి. శ్రావణమాసం మొదలుకొని నిత్యం పూజలతో భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈ శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో అల్లాదుర్గం మండల ప్రజలే కాకుండా చుట్టుపక్కల మండలాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరై వీరభద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తులు అత్యధిక సంఖ్య లో పాల్గొని వీరభద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో జరుగుతున్న సప్త భజనలు సోమవారంకు మూడో రోజుకు చేరుకున్నాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఈ సప్త భజనలో పాల్గొని ఓం నమశ్శివాయం ఓం నమశ్శివాయం అంటూ భజనలు చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు.

## ఖమ్మంపల్లిలో గణశ మండప నిర్మాణానికి జడ్పీటిసి శ్రీకారం

**మునిపలి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో గణేశ మండప నిర్మాణానికి సోమవారం జడ్పీటిసి సభ్యులు పైతర మీనాక్షి సాయికుమార్ భూమి పూజా కార్యక్రమం నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. పిఎస్ఆర్ ఫౌండేషన్ సహకారంతో విఘ్నేశ్వరుడి మండప నిర్మాణాన్ని చేపడుతున్నట్లు జడ్పీటిసి పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులు పైతర సాయికుమార్, ఉప సర్పంచ్ తుడుం దుర్గయ్య, నాయకులు తుడుం సుభాష్, నాయకులు పాల్గొన్నారు.